




sahanamvande.com

epaper.sahanamvande.com

# సహానం వందే

హైదరాబాద్ | 30-07-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 115 EDITOR: ROHINI



# జామర్ నీడలో చైనా పరీక్షలు

## 1.30 కోట్ల మంది విద్యార్థులతో గావోకావో పరీక్ష




- పరీక్షా కేంద్రాల చుట్టూ ఏఐ భద్రత
- పేపర్ లీక్ కాకుండా డ్రాగన్ కట్టుదిట్టం
- అమెరికా అడ్మిషన్ల ప్రక్రియ మరింత ఆసక్తికరం
- స్కూల్ గ్రేడ్లు, ఎస్సేలు, సిఫారసు లేఖలే కీలకం
- వివిధ దేశాల అనుసరిస్తున్న పరీక్ష పద్ధతులు

**మన దేశంలో పరీక్షలంటేనే గుండెల్లో దడ మొదలవుతుంది. ఒక్క పేపర్ లీక్ అయితే చాలు లక్షలాది మంది విద్యార్థుల కష్టమంతా నీళ్లపాలవుతుంది. మరి ప్రపంచంలో మిగతా దేశాలు ఈ సమస్యను ఎలా ఎదుర్కొంటున్నాయో తెలుసుకుంటే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. చైనా నుంచి అమెరికా వరకు పెద్ద పెద్ద దేశాల్లో ఎగ్జామ్ సిస్టమ్స్ ఎలా ఉంటాయో చూద్దాం.**
**- సహానం వందే, హైదరాబాద్**

మన దేశంలో నీట్ పేపర్ లీక్ తర్వాత పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని మళ్లీ నిలబెట్టేందుకు ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఒక ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో కీలకమైన సంస్కరణలను సూచించే బాధ్యతను వీరికి అప్పగించారు. కేవలం మన దేశమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఇలాంటి సవాళ్లను ఎదుర్కొన్నాయి. విద్యార్థులను ఎంపిక చేయడానికి ఆయా దేశాలు అనుసరిస్తున్న విధానాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి.

### చైనా గావోకావో పరీక్ష

ప్రపంచంలోనే అత్యంత కఠినమైన పరీక్షా విధానం ఉన్న చైనా గురించి చెప్పుకోవాలి. అక్కడ నిర్వహించే గావోకావో పరీక్ష ప్రపంచంలోనే అతిపెద్ద, కట్టుదిట్టమైన ప్రవేశ పరీక్షగా పేరుగాంచింది. ప్రతి సంవత్సరం దాదాపు 1.3 కోట్ల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్ష రాస్తారు. పరీక్ష ప్రారంభం కావడానికి కొన్ని నెలల ముందే అక్కడి విద్యాశాఖ అధికారులు ప్రమత్తమవుతారు. పోలీస్ శాఖ, సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీలు, టెలికాం రెగ్యులేటర్లు అన్నీ కలిసికట్టుగా పనిచేస్తాయి. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత మామూలుగా ఉండదు, అదొక పెద్ద కోటలా మారుతుంది.

### జామర్లతో భద్రత మరింత కట్టుదిట్టం...

డ్రాగన్ కంట్రీలో విద్యార్థులు పరీక్ష హాల్‌లోకి వెళ్లేటప్పుడు బయోమెట్రిక్ సహా పలు దఫాలుగా కఠినమైన తనిఖీలు చేస్తారు. ఎగ్జామ్ సెంటర్స్ చుట్టుపక్కల ఎలాంటి కమ్యూనికేషన్ సిగ్నల్స్ అందకుండా జామింగ్ టెక్నాలజీ వాడతారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో విద్యార్థుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే క్షణాల్లో గుర్తిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎంతటి పెద్ద పరీక్షనైనా ఎంత భద్రంగా నిర్వహించవచ్చో చైనా నిరూపిస్తోంది.

### అమెరికాలో పరిగణలోకి స్కూల్ గ్రేడ్లు...


ఇప్పుడు సరిగ్గా దీనికి పూర్తి విరుద్ధమైన అమెరికా విధానం గురించి చూద్దాం. అక్కడ మన దేశంలో లాగా ఒకే ఒక ప్రభుత్వ ప్రవేశ పరీక్ష అంటూ ఏదీ ఉండదు. యూనివర్సిటీలే స్వయంగా తమ అడ్మిషన్ క్రైటీరియాని నిర్ణయించుకుంటాయి. ఎస్ఏటీ లేదా ఏసీటీ మార్కులతో పాటు స్కూల్ గ్రేడ్లను పరిగణలోకి తీసుకుంటారు. విద్యార్థులు రాసిన ఎస్సేలు, సిఫారసు లేఖలు, పాఠశాల బయట వారు సాధించిన విజయాలను కూడా అంచనా వేస్తారు. ప్రవేశాలు కేవలం ఒక్క పరీక్ష మీద ఆధారపడి ఉండవు కాబట్టి సిస్టమ్ చాలా ప్రశాంతంగా ఉంటుంది. అమెరికా పద్ధతి సులభంగా అనిపించినప్పటికీ అది కాస్త సంక్లిష్టమైన ప్రక్రియ.

### ఆస్ట్రేలియాలో ప్రతిభే ఆధారం...

ఇక ఆస్ట్రేలియా విషయానికి వస్తే అక్కడ కూడా ఒకే ఒక్క పరీక్ష భారాన్ని విద్యార్థుల మీద మోపరు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు చూపిన ప్రతిభ ఆధారంగా వారికి జాతీయ స్థాయిలో ఒకే రకమైన ర్యాంకులను కేటాయిస్తారు. రోజూవారీగా చదువులో చూపించే స్థిరమైన ప్రతిభే యూనివర్సిటీ సీట్లను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దీనివల్ల విద్యార్థులపై మానసిక ఒత్తిడి చాలా వరకు తగ్గుతుంది.

### జర్మనీ విధానం...

జర్మనీలో కూడా ఒక సరికొత్త, ఆసక్తికరమైన విధానం అమలవుతోంది. ఇక్కడ వికేంద్రీకరణతో పాటు కొన్ని ప్రత్యేక కోర్సులకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. సాధారణంగా యూనివర్సిటీ అడ్మిషన్లన్నీ విద్యార్థులు స్కూల్ చివర్లో సాధించిన మార్కుల ఆధారంగానే జరుగుతాయి. కానీ మెడిసిన్, ఫార్మసీ, డెంటిస్ట్రీ వంటి అత్యంత పోటీ ఉండే కోర్సులకు మాత్రం సెంట్రలైజ్డ్ అడ్మిషన్లను ఉపయోగిస్తారు.




### బ్రెజిల్ లో ఒకే ఒక జాతీయ ప్రవేశ పరీక్ష

ఇక లాటిన్ అమెరికా దేశమైన బ్రెజిల్ విధానం మరోలా ఉంటుంది. అక్కడ విద్యార్థులు ఒకే ఒక జాతీయ ప్రవేశ పరీక్ష రాస్తారు. ఆ వచ్చిన స్కోర్‌ను ఉపయోగించి ఒకే ఒక సెంట్రల్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ద్వారా అనేక ప్రభుత్వ యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకుంటారు. వేర్వేరు సంస్థల కోసం వేర్వేరు పరీక్షలు రాసే పనే లేకుండా కేవలం ఒక్క స్కోర్‌తో పలు యూనివర్సిటీల తలుపులు తట్టవచ్చు. పరీక్ష నిర్వహణను, అడ్మిషన్ ప్రక్రియను బ్రెజిల్ చాలా చక్కగా వేరు చేసింది.

# బర్గర్లు అమ్మితే కేసు బుక్

## స్కూళ్ల సమీపంలో జంక్ ఫుడ్ నిషేధం

**పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న జంక్ ఫుడ్ పై మహారాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. బుధ వారం ఉపవారం బుధవారం నాడు ఆహార, ఔషధ నియంత్రణ శాఖ కీలకమైన ఆదేశాలు జారీ చేసింది. బడుల చుట్టూ ఉన్న ప్రమాదకరమైన ఆహార పదార్థాల విక్రయాలను పూర్తిగా అడ్డుకోవడానికి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. చిన్ననాడే పిల్లలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా కాపాడటమే ఈ కొత్త చట్టం ప్రధాన ఉద్దేశం. - సహానం వందే, మహారాష్ట్ర**

- మహారాష్ట్ర సర్కారు మహా నిర్ణయం
- తీవ్రమవుతున్న అనారోగ్య ముప్పుకు చెక్
- బలవర్ధక భోజనమే బడిలో ముఖ్యం




మహారాష్ట్రలో పాఠశాలల చుట్టూ 50 మీటర్ల పరిధిలో అన్ని రకాల జంక్ ఫుడ్ అమ్మకాలను పూర్తిగా నిషేధించారు. ప్రకటనలు ఇవ్వడం, ఉచితంగా పంపిణీ చేయడం కూడా నేరంగా పరిగణిస్తారు. అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు ఉండే ప్యాకెట్ చిప్స్,శీతల పానీయాలు, చాక్లెట్లు, ఇన్‌స్టాంట్ స్నాక్స్ వంటి వాటిని ఎక్కడా విక్రయించడానికి వీల్లేదు. పిల్లల ఆరోగ్య భద్రతను కాపాడటానికి ఆహార, ఔషధ నియంత్రణ శాఖ ఈ ఆదేశాలను జారీ చేసింది. బడుల చుట్టూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు లక్ష్యం.

### పాఠశాలల క్యాంటీన్లపై కఠిన నిబంధనలు

ప్రతి పాఠశాల క్యాంటీన్ తప్పనిసరిగా ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి. క్యాంటీన్లలో ప్యాకెట్ ఆహారాలకు బదులుగా తాజా పండ్లు, పాలు, మజ్జిగ, మొలకెత్తిన గింజలు, సంప్రదాయ భారతీయ చిరుతిండ్లను మాత్రమే విక్రయించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను క్యాంటీన్ల లోపల కూడా పూర్తిగా నిషేధించాలని పాఠశాల యాజమాన్యాలకు తేల్చిచెప్పారు.

### ఆరోగ్య స్పృహ పెంచేందుకు శిక్షణ

పాఠశాలల్లో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులలో కూడా పోషకాహారంపై అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉపాధ్యాయులకు ఆహార భద్రతా పద్ధతులపై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. పాఠశాలల లోపల, చుట్టుపక్కల ప్రాంతాలలో విక్రయించే ఆహార పదార్థాలపై నిఘా మరింత కఠినతరం చేస్తారు. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడతారు.

### తనిఖీలు... కఠిన శిక్షలు

నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. పాఠశాలలు, క్యాంటీన్లు, సమీపంలోని దుకాణాలపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలు విధించడంతో పాటు లైసెన్సులు రద్దు చేసేలా అధికారులు చర్యలు చేపడతారు. పాఠశాలల సమీపంలో పొగాకు, ఇతర నిషేధిత ఉత్పత్తుల అమ్మకాలపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఉక్కుపాదం మోపుతారు.

### భవిష్యత్ తరాల కోసం...

పిల్లలకు ప్యాకెట్ ఆహారాలు మరియు పానీయాలపై నిఘాను మరింత కఠినతరం చేశారు. ఆహార కల్తీ, తప్పుదారి పట్టించే లేబుల్స్, అసురక్షిత ఆహార ఉత్పత్తులపై మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున దాడులు నిర్వహించింది. ఈ సమగ్రమైన ప్రచారంలో భాగంగానే తాజాగా ఈ నిబంధనలను అమల్లోకి తెచ్చారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలతో సమాజంలో మంచి మార్పు వస్తుందని ఆశిస్తున్నారు.

# కంగనా రనౌత్ X రాఖీ సావంత్

## సెలెబ్రిటీల మధ్య నిప్పు రాజేసిన నీట్ రచ్చ

**దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ నిరసనల అంశం ఇప్పుడు సినిమా తారల మధ్య పచ్చి బూతుల వార్‌గా మారింది. పార్లమెంటులో చట్టాలు చేయాల్సిన సెలబ్రిటీ లీడర్ కంగనా రనౌత్ యువతపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై మరో కాంట్రవర్సీ క్వీన్ రాఖీ సావంత్ నేరుగా రంగంలోకి దిగి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మొదలైన ఈ మాటల యుద్ధం ప్రస్తుతం దేశ రాజకీయాల్లో, సోషల్ మీడియాలో ఒకే ఒక్క మంటను రగిలిస్తోంది.**
**- సహానం వందే, న్యూఢిల్లీ**

- కంగనాపై ఇన్‌స్టాలో ఒక ఫైర్ వీడియో రిలీజ్
- చుడైల్, గట్టర్ అంటూ ఘాటైన వ్యాఖ్యలు
- అసలు ఎంపీ ఎలా అయ్యావంటూ విమర్శలు
- సోషల్ మీడియాలో మాటల యుద్ధం



నీట్ పేపర్ లీక్ ఆందోళనలు, విద్యార్థి సంఘాల నిరసనలు ఎంతటి సంచలనం సృష్టించాయో అందరికీ తెలిసిందే. రోడ్లపైకి వచ్చి పోరాడుతున్న యువతను ముఖ్యంగా జెన్ జీ తరాన్ని టార్గెట్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఎంపీ, ప్రముఖ నటి కంగనా రనౌత్ తీవ్రమైన విమర్శలు గుప్పించారు. నిరసనల్లో పాల్గొంటున్న మహిళలను, విద్యార్థులను జెన్ గట్టర్ అంటూ, వారిని చూస్తేనే వాంతులు వచ్చేలా ఉన్నాయంటూ కంగనా చేసిన వ్యాఖ్యలు క్షణాల్లో వైరల్ అయిపోయి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆగ్రహజ్వాలలను రగిలించాయి.

### రాఖీ సావంత్ సంచలన ఎంట్రీ

కంగనా చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేపగా ఎంటర్‌టైన్‌మెంట్ ప్రపంచం నుండి ఎవరూ ఊహించని విధంగా మరో కాంట్రవర్సీ క్వీన్ రంగంలోకి దిగింది. ఆమె ఎవరో కాదు రాఖీ సావంత్. కంగనా వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాఖీ సావంత్ నేరుగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఫైర్ వీడియోను రిలీజ్ చేసింది. దేశంలోని యువతను, ఆడబిడ్డలను కించపరిచేలా పార్లమెంట్ సభ్యురాలైన ఒక మహిళ మాట్లాడటం ఏంటని రాఖీ నిలదీసింది. కంగనాను ఏకంగా చుడైల్ అంటూ, ఆమె నోరు గట్టర్ లాంటిదంటూ ఎప్పట్లాగే తనదైన శైలిలో విరుచుకుపడింది.

### రాజకీయ ప్రయాణంపై తీవ్ర ప్రశ్నలు

ఈ వీడియోలో రాఖీ సావంత్ కేవలం తిట్లతో సరిపెట్టకుండా కంగనా రాజకీయ ప్రయాణంపై అత్యంత ఘాటైన ప్రశ్నలు లేవనెత్తింది. అసలు నువ్వు ఎంపీ ఎలా అయ్యావు? నువ్వు గనుక నిజంగా ప్రజల్లోకి వచ్చి పోటీ చేస్తే నీకు కనీసం డిపాజిట్లు కూడా దక్కవంటూ రాఖీ సవాలు విసిరింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గంలో అసలు నువ్వు ఎలా గెలిచావో, నీకు అంత పేరు ఎలా వచ్చిందో నాకైతే అంతుచిక్కడం లేదంటూ తీవ్రమైన వ్యంగ్యాస్త్రాలు సంధించింది. రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేయాల్సింది పోయి యువతను అవమానించడం నీ దిగజారిన మనస్తత్వానికి నిదర్శనమని మండిపడింది.

### రైతుల ఆందోళనల నుంచి నేటి పోరు వరకు

గతంలోనూ పలుమార్లు కంగనా రనౌత్ వ్యాఖ్యలు బాలీవుడ్‌లోనూ, రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర కలకలం రేపాయి. రైతుల ఆందోళనల సమయం నుంచి మొదలుకొని తాజా నీట్ నిరసనల వరకు ఆమె వాడే భాషపై ఎప్పుడూ విమర్శలు వస్తూనే ఉన్నాయి. అయితే ఈసారి ఆమె నేరుగా జెన్ జీ తరాన్ని, విద్యార్థినులను టార్గెట్ చేయడం వల్ల వివాదం సెలబ్రిటీల మధ్య రచ్చగా మారింది. రాజకీయ నాయకురాలిగా మారిన తర్వాత కూడా కంగనా తన పాత శైలిని మార్చుకోలేదని, తోటి నటులు, ప్రజల నుంచే ఆమెకు ఇలాంటి ఘాటైన రియాక్షన్లు రావడం గమనార్హం. సోషల్ మీడియాలో కంగనా మద్దతుదారులు, రాఖీ ఫ్యాన్స్ మధ్య పెద్ద యుద్ధమే జరుగుతోంది.